క్లుప్తంగా

నేడు వీఎంసీ కార్యాలయాల్లో స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సమస్యల పరిష్కారానికి 'స్పందన'ను వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడానికి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లోని సర్కిల్–1, సత్యనారాయణపురంలోని సర్కిల్–2, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా తమ సమస్యలను ఆయా ప్రాంతవాసులు జోనల్ కమిషనర్ల దష్టికి తీసుకెళ్లవచ్చని వివరించారు.

రేపు లక్ష్మీ జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లక్ష్మీ జయంతి పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మంగళవారం చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి కల్యాణ మండపంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేయనున్నట్లు విఖనస సేవా సమాఖ్య సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ సోమవారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మేదినీ పూజ జరగనున్నాయని తెలిపారు. మంగళవారం నవగ్రహారాధన, హోమం, సామూహిక కుంకుమార్చన, విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథి చిన ఆగిరిపల్లి రేణుకాక్షేత్రం పీఠాధిపతి వీర కృష్ణ భవానీతో లక్ష్మీ ప్రవచనం ఉంటుందని తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని శ్రీ వెంకట సాయిశ్రీ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆదివారం దాతలు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. శివశక్తి నగర్‌కు చెందిన దాత సుబ్బారావు తన పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పండ్లు పంపిణీ చేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు నాగరాజీ మాట్లాడుతూ దాతల దాతృత్వమే వృద్ధాశ్రమాలకు ఊపిరి అని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై పలువురు విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీఅరుణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు చక్కటి అభినయంతో నృత్య ప్రతిభను ప్రదర్శించారు. కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ప్రసాదాలను అందజేశారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీ ఢీకొని యువకుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రూరల్‌లో జక్కంపూడికి చెందిన ఎం. విజయ్ కొరియర్ కంపెనీలో ఉద్యోగి. ఆదివారం మధ్యాహ్నం విజయ్ ఇంటి వద్ద భోజనం చేసి బైక్‌పై ఆఫీసుకు బయలుదేరాడు. జక్కంపూడి మొయిన్‌రోడ్డుకు వచ్చే సరికి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో విజయ్‌కి గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాడి కేసులో కొత్తపేట పోలీసులు ఆదివారం ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట వాగు సెంటర్‌లో ఇరువర్గాల కొట్లాట, దాడుల ఘటనలో కునిపిల్ల హరి, రాచకొండ శ్రీనివాసరావును అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరచగా, వారిని రాజమండ్రి జైల్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. దాడిలో పాల్గొన్న మరి కొంత మందిని త్వరలోనే అరెస్టు చేస్తామని కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

11న సంకటహర చతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఈనెల 11వ తేదీ శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు స్వామివారికి విశేషంగా రుద్రాభిషేకం, అలంకార అర్చన జరుగుతాయని పేర్కొన్నారు.

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి

- 26.66 లక్షలతో రక్షణ గోడ
- మరో రూ.37లక్షలతో లోపల ఒక గది



కొత్తగా నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ, గేటు



లోపల నిర్మిస్తున్న పాత్‌వేలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక 41వ డివిజన్లో ముస్లిం శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నారు. గట్టు వెనుక ప్రాంతం భవానీపురం 41వ డివిజన్ పరిధిలో నివసించేవారిలో అత్యధిక శాతం మంది ముస్లిం మైనార్టీలే. 65వ నెంబర్ జాతీయ రహదారి పక్కన సుమారు మూడెకరాల స్థలంలో ముస్లిం శ్మశానవాటిక ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటైన దీని చుట్టూ నిర్మించిన ప్రహరీ ఎత్తు తక్కువ కావడంతో రక్షణ లేకుండా పోయింది. దాని స్థానంలో దాదాపు 7 అడుగుల ఎత్తులో ఉత్తరం వైపు ప్రహరీ నిర్మించటంతో దానికి రక్షణ ఏర్పడింది. దీనికి ప్రధాన గేటు, మరొక చిన్న గేటు కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల వరకు దీనికి ప్రహరీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా లోపలకు వెళ్లిపోయేవారు. ముస్లిం మైనార్టీలు పవిత్ర స్థలంగా భావించే శ్మశానవాటిక ఆ విధంగా తయారు కావడంతో వారంతా స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మహమ్మద్ ఇర్ఫాన్‌ను కలిసి సమస్యను వివరించారు. ఆయన వెంటనే ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడం, ఆయన స్పందించి రూ.26.66 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ప్రహరీ నిర్మాణాన్ని గత నెల 11వ తేదీన ప్రారంభించడం చకచకా జరిగిపోయింది. దీంతో ముస్లిం మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ కంఠం కింది వదిలేసిన స్థలం

బ్రిటిష్ కాలంలో తురకపాలెం పంచాయతీ కింద ఉండే ఈ ప్రాంత గ్రామ కంఠం కింద ఉన్న స్థలంలో సుమారు మూడెకరాలు శ్మశానవాటిక కోసం నాటి ముస్లిం మత పెద్దలు వదిలేశారు. అది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చింది. భవానీపురం హజరత్ సయ్యద్ షాహిద్ దర్గా ఎదురుగా ఉన్న ఈ శ్మశానవాటిక పురాతనమైంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసి వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. దానిలో వారికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మసీదులు, దర్గాలు, శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నారు. వీటిపై ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులను కల్పిస్తున్నాం



శ్మశానవాటిక స్థలం రక్షణతోపాటు, గుర్తు తెలియని మృతదేహాలు, అద్దె ఇళ్ల వద్ద పెట్టనివ్వని మృతదేహాలకు అంత్యక్రియ క్రతువు చేసేందుకు లోపల ఒక గదిని నిర్మించనున్నాం. దీనికి రూ.37లక్షలు మంజూరయ్యాయి. వాటితో లోపల పాత్‌వేలు నిర్మిస్తున్నాం. మృతదేహాలను ఖబరస్థాన్‌కు తీసుకువెళ్లే దనాజనుకూడా ఇక్కడ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. లోపల లైటింగ్ సౌకర్యాన్ని మరింత మెరుగు పరచనున్నాం. ప్రహరీ బయట గ్రీనరీ, మొక్కల పెంపకం చేపట్టనున్నాం.

– మహమ్మద్ ఇర్ఫాన్, 41వ డివిజన్ కార్పొరేటర్

వాస్తవాలు తెలుసుకుని ప్రసారం చేయాలి

ఏసీపీ రమణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమణమూర్తి, పక్కన సీఐ లక్ష్మీనారాయణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పూటుగా మద్యం సేవించి రోడ్డు మీద పడిపోయిన వ్యక్తిని పక్కకు కూర్చోబెట్టిన పోలీసులపై ఓ చానల్ అసత్య వార్తను ప్రసారం చేయడం బాధాకరమని, వాస్తవాలు తెలుసుకోవాలని ఏసీపీ రమణమూర్తి అన్నారు. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో అయోధ్యనగర్ వద్ద రెడ్డి వీరబాబు అనే వ్యక్తి పూటుగా మద్యం సేవించి రోడ్డుమీద పడిపోయాడని తెలిపారు. ఆ సమయంలో కొట్లను మూయించేందుకు వచ్చిన పోలీస్ రక్షక్ వాహనాన్ని పట్టుకొని అతను పైకి లేస్తున్నాడని పేర్కొన్నారు. దాన్ని గమనించిన రక్షక్ వాహన సిబ్బంది కిందకు దిగి అతడు మళ్లీ రోడ్డు మీదకు రాకుండా స్థానికుల సాయంతో రోడ్డు పక్కన కూర్చోబెట్టి వెళ్లారన్నారు. అయితే దీనికి పూర్తి భిన్నంగా మద్యం సేవించిన వీరబాబును రక్షక్ వెహికలే ఢీకొట్టిందని, తీవ్రగాయాలపాలైన అతన్ని పట్టించుకోకుండా పోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లిపోయారంటూ ఓ చానల్‌లో(సాక్షి కాదు) అసత్య వార్తను ప్రసారం చేయడం దారుణమన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా, బాధితుడిని, స్థానికులను విచారించకుండాపోలీసు వ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా కథనాలను ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి నిరాధారణ వార్తను ప్రసారం చేసిన చానల్‌పై ఐపీసీ 500 సెక్షన్‌కింద కేసు నమోదు చేసి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు కూడా చేయనున్నట్లు తెలిపారు. వాస్తవాలను తెలుసుకొని కథనాలను ప్రసారం చేయాలని కోరారు. సీఐ ఎస్‌వీవీఎస్ లక్ష్మీనారాయణ, స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.

'సార్' సినిమాకు ప్రత్యేక రాయితీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధనుష్ నటించిన 'సార్' సినిమా ప్రేక్షకాదరణ పొందిందని, చిత్ర సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శనపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు జేపీఆర్ ఫిల్మ్స్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. సార్ సినిమాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారన్నారు. సినిమా చూసేందుకు విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్ పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుంచి వస్తే ఒక టికెట్‌పై ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కోరితే వారికోసం ప్రత్యేకంగా ఒక షో ప్రదర్శిస్తామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 'సార్' సినిమా ప్రదర్శిస్తున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 97051 61908లో సంప్రదించాలన్నారు. సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ 'అధినేత వినీత్‌సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు, క్రీడా పరికరాలు



ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న అయ్యంకి మురళీకృష్ణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అయ్యంకి వెంకట రమణయ్య స్మారకార్థం ఆయన మనువడు సరస్వతి సామ్రాజ్యం అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ.. ఠాగూర్ గ్రంథాలయానికి క్రీడా పరికరాలు, పుస్తకాలు అందజేశారు. ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య 44వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. అయ్యంకి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలను కొనియాడారు. పరికరాలు అందజేసిన మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సునీత, రమేష్, జగదీష్, మోహన్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు, ఐరన్ గ్రిల్‌కు మరమ్మతులు



కాళేశ్వరరావు మార్కెట్.. లోబ్రిడ్జి వద్ద వాటర్ పైప్‌లైన్‌కు చేస్తున్న మరమ్మతులు

వన్‌టౌన్‌లో లోబ్రిడ్జి వద్ద ఆదివారం మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. అక్కడే రైల్వే ట్రాక్ వద్ద ఐరన్ గ్రిల్‌ను ఏర్పాటుచేశారు. ఈ పనులు జరగడంతో వాహనాలు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



రైల్వే ట్రాక్‌కు ఐరన్ గ్రిల్ ఏర్పాటుచేస్తున్న సిబ్బంది



మరమ్మతులు జరుగుతుండటతో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు

జగన్‌తోనే రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు

షేక్ ఆసిఫ్



అబిద్‌ను సత్కరిస్తున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు కొనసాగనున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా పాలకవర్గం డైరెక్టర్‌గా నియమితులైన మహ్మద్ అబిద్.. ఆసిఫ్‌ను ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆసిఫ్‌ను అబిద్ సత్కరించారు. ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. వివిధ నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ముస్లిం మైనార్టీలు విశ్వసిస్తున్నారని వివరించారు.

గ్రంథాలయాలు విజయానికి సోపానాలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజయానికి సోపానాలు అని చిత్తరంజన్ శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ సంపత్ కుమార్ చెప్పారు. స్థానిక సత్యనారాయణపురం చిత్తరంజన్ శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవటం –మాకు ఇష్టం కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల సేవలను ప్రజలకు తెలియ చేసేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు మాస్ రీడింగ్, చదవటం మాకుఇష్టం ఉపయోగాలు అంశంపై పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతగా రిటైర్డ్ ఉద్యోగి పి.శ్రీనివాసులు వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

మంచి నడవడికతో అభివృద్ధి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్

ఆటోనగర్(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ మంచి నడవడికతో అభివృద్ధి చెందాలని జమా అతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్ అన్నారు. ఆదివారం రాత్రి జవహర్ ఆటోనగర్‌లోని ఒక ప్రయివేట్ హోటల్‌లో జమా అతె ఇస్లామి హింద్ విజయవాడ ఆధ్వర్యంలో మానవత– నైతికత పై ఆత్మీయ సమావేశం జరిగింది. ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ సమాజంలో ఎక్కడ చూసినా మోసం, దగా అనేవి పెరిగిపోయాయన్నారు. సమాజంలో నైతికత విలువలు పెంపొందించడానికి జమాఅతెఇస్లామి హింద్ రాష్ట్రస్థాయిలో సెమినార్‌లను నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సిటీ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, హబీబ్‌ఖాన్, అబ్దుల్‌కలాం, బాబు, బాలగంగాధర్‌తిలక్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో దేశ భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న ఎన్వీ రావు, ఉదయ్‌కిరణ్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దేశ భవిష్యత్తుకు నూతన ఆవిష్కరణలు దోహదపడతాయని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పేర్కొన్నారు. నగరంలో ఈ నెల 2 నుంచి 4 వరకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపిన 'రాకేష్' విద్యార్థులకు ఆదివారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఎన్వీ రావు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లో రాకేష్ స్కూల్ విద్యార్థులు దేశానికి ఉపయోగపడే పలు అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారన్నారు. వాహనాలు నడిపేటప్పుడు నిద్ర వస్తే అప్రమత్తం చేసే పరికరం, పర్యావరణ పరిరక్షణ, దేశ రక్షణ రంగంలో కీలకమైన ఆర్మీ జవాన్లకు ఉపయోగపడే పరికరం, వృథాగా పడి ఉన్న ప్లాస్టిక్ నుంచి పెట్రోల్, గ్యాస్ తయారీ పరికరాన్ని ప్రదర్శించారన్నారు. వీటిపై కలెక్టర్ ఢిల్లీరావు ఆకర్షితులై విద్యార్థులను అభినందించారన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ద్వితీయ బహుమతి సాధించిన వెంకటరమణ, సీహెచ్ వెంకటరమణ, కె.అఖిల్ బృందానికి అమెరికాకు చెందిన వెల్ ఫర్ గో ఉపాధ్యక్షులు ఉదయ్‌కిరణ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ మల్లీశ్వరి, ఎస్. కాంతికల్పన తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు సంఘ ప్రతినిధులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చిట్టినగర్‌లోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవానికి పలువురు బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులుగా ముస్తఫా, ఉపాధ్యక్షులుగా పుల్లారావు, ప్రధాన కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షులుగా చిప్పాడ చందు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కనకారావు, చల్లపల్లి మోహన్‌రావు, ధనాలకోట శోభన్‌బాబు, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాగుల్ మీరా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రంజాన్‌లో తమ నియోజకవర్గాల్లోని పేద ముస్లింలకు చేయూతనందించాలన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్యలపై పోరాటంలోనూ, రాజకీయాల్లో, సేవా కార్యక్రమాల్లో ఆజాద్ కమిటీ అగ్రభాగాన నిలవాలన్నారు. అనంతరం నూతన కమిటీల నియామకం చేశారు.ఆజాద్ ముస్లిం కమిటీ కృష్ణాజిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజ్మతుల్లా, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులుగా షేక్ షాకిర్, పల్నాడు జిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజీజ్, విజయవాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, నగర ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ లను నియమించారు. వారికి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ(హఫీజ్), రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అజ్మతుల్లా, సెంట్రల్ ఇన్‌చార్జి మహమ్మద్ కాలేషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్న సీఎం జగన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువుగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ దిగ్గజ కంపెనీలన్నీ సుముఖత చూపాయంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమ పథం, అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న గొప్పవ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా రావడం అదృష్టమన్నారు. గత టీడీపీ హయంలో ఎంఓయూలు తప్పించి, ఎక్కడా అభివృద్ధి కనిపించలేదని కేవలం ప్రచారానికి మాత్రమే చంద్రబాబు పని చేశాడని విమర్శించారు. జగనన్న సంక్షేమ పాలన చూసి ప్రఖ్యాతిగాంచిన కంపెనీల అధినేతలు స్వయంగా ఈ సమ్మిట్‌లో పాల్గొని తమ పెట్టుబడులు వివరించడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా దీనిపై కూడా విషప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బాధ్యతగల మీడియా రంగంలో ఉండి కూడా కొన్ని పచ్చ మీడియాలు రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేలా రాతలు రాయడం నీచమైన సంస్కృతి అని, వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్న జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, నందెపు సురేష్, చింతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వసంతపై దుష్ప్రచారాన్ని ఖండించిన ఎస్సీ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై ఉద్దేశ్య పూర్వకంగా సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎస్సీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గొల్లపూడిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు బయ్యారపు రవి కిషోర్ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. అది చూసి ఓర్వ లేని చంద్రబాబు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని అన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఆయన అనుచరుడు దేవినేని ఉమామహేశ్వరరావు కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు లభిస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక తన అనుయాయులతో సోషల్ మీడియాలో దుష్ప్రచారాన్ని చేయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌పై బురద చల్లాలని యత్నిస్తే నియోజకవర్గంలోని 65వేల మంది ఎస్సీలు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. దళిత జేఏసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి ప్రతాప్, కుమ్మరి నాగరాజు, మంద నోవా, నల్లమోతు చిన్నయ్య, కోపూరు రాంబాబు, పైడూరుపాడు ఎంపీటీసీ బయ్యారపు కల్పన కిషోర్ పాల్గొన్నారు.

లయన్స్ సేవలు వినియోగించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ జిల్లా గవర్నర్ శ్రీశాంతి సూచించారు. మధురానగర్ గౌతమ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్, స్వర సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది.